జ్వరమూ.. మంచిదే!

6 ప్రయోజనాలు ఉన్నాయంటున్న ఆరు అధ్యయనాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): జ్వరం వస్తే శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా అసౌకర్యంగా ఫీల్ అవుతాం. అయితే, తరచూ సుస్తి పడటం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే రోగాలను కూడా తప్పించుకోవచ్చని తెలుసా? ప్రపంచంలోని ప్రఖ్యాత ఆరు అధ్యయనాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. తరచూ జ్వరం వస్తే కలిగే ఆరు లాభాలను వివరణలతో సహా వెల్లడించాయి.

1. తెల్ల రక్తకణాలు అలర్ట్

జ్వరం వస్తే, శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో రోగ నిరోధక వ్యవస్థకు రక్షణగా ఉండే తెల్ల రక్త కణాలు అలర్టై పోతాయి. వ్యాధిని కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌ల కట్టడికి ఎముక మజ్జలో మరిన్ని తెల్ల రక్తకణాల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి మరింత పెరుగుతుందని 'ఇమ్యునాలజీ అండ్ సెల్ బయాలజీ' జర్నల్‌లోని అధ్యయనం తెలిపింది.

2. వైరస్‌ల కట్టడి:

మనం తీసుకొన్న ఆహారం, పీల్చే గాలి ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి సూక్ష్మజీవులెన్నో శరీరం లోపలికి ప్రవేశిస్తాయి. ఇవి చైతన్యవంతంగా ఉండాలంటే శరీర ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెంటీగ్రేడ్ (98.6 ఎఫ్) ఉండాలి. అయితే, సుస్తి చేసిన వ్యక్తికి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వంటి సూక్ష్మజీవుల సంతానాభివృద్ధి జరుగదు. ఈ మేరకు 'వైరాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం వివరించింది.

3. యాంటీవైరల్ యాక్టివిటీ:

శరీర ఉష్ణోగ్రతలో పెరుగుదల సూక్ష్మక్రిముల వృద్ధిని నిలుపుదల చేయడమే కాకుండా ఇమ్యూన్ సెల్స్ యాక్టివిటీని పెంచుతుంది. ఉష్ణోగ్రతలో పెరుగుదల నమోదవ్వగానే సైటోకైన్స్ ప్రొటీన్ ఉత్తేజితమవుతుంది. ఇది యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్ అణువులను శరీరంలోకి విడుదల చేస్తుంది. దీంతో వ్యాధి తీవ్రత తగ్గుతుందని 'క్లినికల్ ఇన్వెస్టిగేషన్' జర్నల్ అధ్యయనం తెలిపింది.

4. కణాల మరమ్మతులు

జ్వరం కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగడంతో హీట్ షాక్ ప్రొటీన్స్ చైతన్యవంతమవుతాయి. సూక్ష్మజీవుల దాడిలో నాశనమైన కణాలకు ప్రత్యేక ప్రొటీన్ సాయంతో ఇవి మరమ్మతులు చేస్తాయి. తద్వారా రోగనిరోధక శక్తిని ఉత్తేజితం చేస్తాయని 'నేచర్ రివ్యూస్ మాలిక్యులార్ సెల్ బయాలజీ' జర్నల్ అధ్యయనం తెలిపింది.

5. డీటాక్సిఫికేషన్ ప్రక్రియ

జ్వరం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు జీవక్రియ రేటు పెరుగుతుంది. అంటే, చెమట పోయడం, మల, మూత్ర విసర్జనలాంటివి జరుగుతాయి. శరీరంలో పేరుకుపోయిన టాక్సిక్ (విష) పదార్థాలను ఇది బయటకు పంపించడమే. ఇది శరీరానికి మంచిదని 'టాక్సికాలజీ అండ్ ఎన్విరాన్మెంటల్ హెల్త్' జర్నల్ అధ్యయనం పేర్కొన్నది.

6. ఇమ్యూనిటీ మెమరీ

తరచూ జ్వరంబారిన పడటంతో ఏ సూక్ష్మజీవి ఎలాంటి ప్రమాదాన్ని కలిగిస్తుంది? దాన్ని ఎలా ఎదుర్కోవాలన్న ట్రైనింగ్ రోగ నిరోధక వ్యవస్థకు తెలుస్తుంది. దీంతో ఆ వ్యాధులు మళ్లీ ఎదురైనా.. సులభంగా ఎదుర్కోగలదని 'ఎక్స్‌పరమెంటల్ మెడిసిన్' జర్నల్ అధ్యయనం తెలిపింది.

డ్రైఫ్రూట్స్‌తో టైప్-2 డయాబెటిస్‌కు చెక్!

60 శాతం మేర ముప్పు తగ్గించే అవకాశం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): డ్రైఫ్రూట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే ముప్పును 60 శాతం మేర తగ్గించవచ్చని యూకే పరిశోధకులు తెలిపారు. డ్రైఫ్రూట్స్ మోతాదును రోజుకు కనీసం 1.3 పీసెస్ చొప్పున పెంచుకొంటూ పోతే ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు. ఎండిన ద్రాక్ష, ఎండిన నేరేడును ఎక్కువగా తీసుకొంటే ఫలితముంటుందని సూచించారు.

అమ్మాయిల కంటే అబ్బాయిలకే.. టైప్-1 డయాబెటిస్ ముప్పు ఎక్కువ!

పదేండ్ల వయసు పైబడిన అమ్మాయిలతో పోల్చి చూస్తే, అబ్బాయిలకే టైప్-1 డయాబెటిస్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉన్నదని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఎగ్జిటర్ పరిశోధకులు తెలిపారు. ఇమ్యూనిటీ సెల్స్‌పై ప్రభావం చూపించే ఆటో యాంటీబాడీ ప్రొటీన్లు అబ్బాయిల్లో ఎక్కువగా విడుదల కావడమే దీనికి కారణంగా పేర్కొన్నారు. 2,35,765 మందిపై చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైనట్టు తెలిపారు.

సిస్టోలిక్ రీడింగ్ ఎక్కువా?

గుండెపోటు రావొచ్చు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రక్తపోటును గుర్తించడానికి బీపీ మీటర్ (స్మిగ్మోమానోమీటర్)లో పై రీడింగ్‌ను సూచించే సిస్టోలిక్ రేటు ఎక్కువగా ఉంటే, భవిష్యత్తులో గుండెపోటు వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుందని మిషిగన్ మెడిసిన్ స్కూల్ పరిశోధకులు తెలిపారు. 18-39 ఏండ్ల మధ్య పురుషులకు సిస్టోలిక్ రీడింగ్ 119 ఎంఎంహెజీగా, మహిళలకు 110 ఎంఎంహెజీగా ఉంటుంది. అయితే, ఈ రీడింగ్ 10 ఎంఎంహెజీ పెరిగితే, గుండెపోటు వచ్చే ప్రమాదం 20-31 శాతం మేర ఎక్కువగా ఉంటుంది.

ఇంటర్నెట్ లేకుండానే

వాట్సాప్‌లో ఫైళ్ల ట్రాన్స్‌ఫర్!

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో ఇకపై 2జీబీకి మించిన ఫైళ్లను ఇంటర్నెట్ లేకుండానే పంపుకొనేలా కొత్త ఫీచర్ రాబోతున్నది. యాపిల్ 'ఎయిర్‌డ్రాప్', గూగుల్ 'నియర్‌బై షేర్'లా ఇది పని చేసే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఆండ్రాయిడ్‌తోపాటు ఐవోఎస్ వెర్షన్‌లోనూ ఇది రానుంది. ఈ ఫీచర్ ద్వారా ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను పూర్తి భద్రంగా (ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్) పంపుకోవచ్చు. ఈ ఫీచర్ ఐవోస్‌లో మాత్రం కొంత భిన్నంగా ఉండే అవకాశం ఉంది. అంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాల్సి ఉంటుందని సమాచారం.

అధికారాన్ని నిలుపుకునేందుకే ప్యాకేజీలు

- బడ్జెట్‌లో ఎన్డీఏ మిత్రపక్షాలకే ప్రాధాన్యం
- ఆ పార్టీలను మెప్పించడానికే ప్రయత్నం
- బడ్జెట్ తీరుపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్
- పార్లమెంటులో విపక్ష ఎంపీల ఆందోళన
- ఉభయసభల నుంచి వాకౌట్ చేసిన సభ్యులు
- 'ఎన్డీఏ బడ్జెట్ వద్దు.. ఇండియా బడ్జెట్ కావాలి'
- ప్లకార్డులు ప్రదర్శించిన పార్లమెంటు సభ్యులు

న్యూఢిల్లీ, జూలై 24: మిత్రపక్షాలకు ప్యాకేజీలు ఇచ్చి అధికారాన్ని నిలుపుకునేందుకే బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఎన్డీఏ మిత్రపక్షాలను మచ్చిక చేసుకునే ప్రయత్నమే కేంద్ర బడ్జెట్ అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షకు నిరసనగా విపక్ష పార్టీల ఎంపీలు పార్లమెంటు మకర్ ద్వార్ వద్ద నిరసన తెలిపారు. అఖిలేశ్ యాదవ్‌తో పాటు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో పలు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. యూపీలో డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి దక్కిందేమీ లేదని పేర్కొన్నారు. లక్నోవాళ్లు(సీఎం యోగిని ఉద్దేశించి) ఢిల్లీవారికి ఆగ్రహం తెప్పించారని, ఇది బడ్జెట్‌లో కనిపించిందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న ఇంటర్నషిప్ పథకంపై ఆయన స్పందిస్తూ.. పదేండ్లుగా యువతను నిరుద్యోగులుగా మార్చి ఇప్పుడు రూ.5,000 జీతం వచ్చే ఉద్యోగాలు ఇస్తామని అంటున్నారని ఆయన పేర్కొన్నారు.

సమాఖ్య స్ఫూర్తిపై దాడి

కేంద్ర బడ్జెట్‌లో విపక్షపాలిత రాష్ట్రాలపై వివక్ష చూపించడం భారతదేశ సమాఖ్య స్ఫూర్తిపై దాడిగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అధికారంపై ఆశతో దేశంలోని ఇతర రాష్ట్రాలను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని, వివక్ష చూపించిందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరగాలని ఇండియా కూటమి గొంతు వినిపిస్తుందని అన్నారు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, ఎవరికీ దీని వల్ల న్యాయం జరగలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. కాగా, బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షను నిరసిస్తూ ఉభయసభల నుంచి ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్ చేశారు. 'ఎన్డీఏ బడ్జెట్ వద్దు.. ఇండియా బడ్జెట్ కావాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలిపారు.

బడ్జెట్ కేటాయింపులపై నిరసన తెలుపుతున్న విపక్ష పార్టీల ఎంపీలు

అన్ని రాష్ట్రాలను ఎలా ప్రస్తావిస్తాం?: నిర్మల

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఎన్డీయే మిత్రపక్షాలు అధికారంలో ఉన్న ఏపీ, బీహార్‌కు మాత్రమే బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారంటూ కేంద్రప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాజ్యసభలో విపక్షాలు కేంద్రం వైఖరిని ఎండగట్టాయి. దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లను ప్రస్తావించే అవకాశం ఉండబోదని, మహారాష్ట్ర పేరును తీయనప్పటికీ, ఆ రాష్ట్రానికి నిధులు ఇచ్చినట్టు వెల్లడించారు. మహారాష్ట్ర కాకుండా అలా నిధులు కేటాయించిన మరో రాష్ట్రం పేరు చెప్పమంటూ మీడియా ప్రతినిధి ఒకరు అడుగగా, తనకు వినబడనట్టే నిర్మల అక్కడి నుంచి వెళ్లిపోయారు.

4జీ, 5జీ.. మరింత ప్రియం!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): టెలికం రంగంలో కీలకంగా భావించే నెట్‌వర్క్ ఎక్విప్‌మెంట్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లీ (పీసీబీఏ)పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని కేంద్రం 15 శాతానికి పెంచింది. దీంతో 4జీ, 5జీ నెట్‌వర్క్‌ను రోల్ అవుట్ చేసే టెలికం సంస్థలపై అదనపు భారం పడనున్నట్టు చెప్తున్నారు. వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలు 5జీ నెట్‌వర్క్‌ను రోల్‌అవుట్ చేయాల్సి ఉంది. పీసీబీఏపై తాజా పెంపుతో ఆయా సంస్థలపై భారం పడుతుందని,అది వినియోగదారులపై ప్రభావం చూపొచ్చని పారిశ్రామికవర్గాలు పేర్కొంటున్నాయి.

పొగరాయుళ్లకు ఉపశమనం!

పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచని కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో ఈసారి పొగరాయుళ్లకు ఉపశమనం లభించింది. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25లో పొగాకు ఉత్పత్తులపై పన్నులో కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రతి బడ్జెట్‌లో పన్నులు పెంచే జాబితాలో తప్పనిసరిగా ఉండే పొగాకు ఉత్పత్తుల్ని, మోదీ సర్కార్ ఈసారి ముట్టుకోలేదు. దీంతో దేశంలో ప్రముఖ సిగరెట్ల తయారీ కంపెనీ 'ఐటీసీ' షేర్లు 5శాతం పెరిగాయి. ఏటా ప్రతి బడ్జెట్‌లో పొగాకు ఉత్పత్తులపై కేంద్రం 'నేషనల్ కలామిటీ కంటింజెంట్ డ్యూటీ' (ఎన్‌సీసీడీ) పేరుతో పన్నులు పెంచేది. దీంతో పొగతాగే వాళ్ల జేబుకు పెద్ద ఎత్తున చిల్లు పెడుతూ వస్తున్నది. గత ఏడాది ఎన్‌సీసీడీ పన్ను రేట్లు 16శాతం పెరిగాయి.

త్వరలో 2,500 సాధారణ కోచ్‌లు

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 24: కొత్త బడ్జెట్‌లో రైల్వే శాఖకు అధిక నిధులు కేటాయించారని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సంతోషం వ్యక్తం చేశారు. బడ్జెట్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్షణమే 2,500 సాధారణ కోచ్‌లను(నాన్ ఏసీ) నిర్మించి, వాటిని త్వరలో ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. రానున్న మూడేండ్లలో మరో 10 వేల కోచ్‌లను తీసుకొచ్చే ప్రణాళిక ఉన్నదని తెలిపారు. మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలకు సరసమైన, సురక్షితమైన రైల్వే ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. రైల్వే శాఖకు 2014కు ముందు రూ.35 వేల కోట్లుగా ఉన్న బడ్జెట్ కేటాయింపులు.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.62 లక్షల కోట్లకు పెరిగినట్టు తెలిపారు.

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌తో పాన్..

అక్టోబర్ 1 నుంచి నిలిపివేత

న్యూఢిల్లీ, జూలై 24: ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీతో 'పాన్' కార్డ్ పొందటాన్ని అక్టోబర్ 1 నుంచి నిలిపివేస్తున్నట్టు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని కోట్ చేస్తూ.. ఐటీ రిటర్న్ దాఖలు చేయటాన్ని కూడా ఉపసంహరిస్తున్నట్టు కేంద్రం తెలిపింది. ఎన్‌రోల్‌మెంట్ ఐడీ ఆధారంగా 'పాన్' కార్డ్ కేటాయింపు నకిలీలకు దారితీస్తున్నది. దీనిని నిలిపివేయటం తప్పనిసరి' అని కేంద్ర బడ్జెట్ పత్రాల్లో నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 2017లో కేంద్రం తీసుకొచ్చిన ఈ ఆప్షన్‌తో పాన్ కార్డు పొందినవారు, ఆదాయ పన్ను అధికారులకు తమ ఆధార్ నంబర్లను అందజేయాల్సి ఉంటుందని అన్నారు. ఇందుకోసం ఒక నిర్ణీత తేదీని తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

తక్కువ ఖర్చుతో టీబీ పరీక్ష

టెక్నాలజీని అభివృద్ధి చేసిన 'ఐసీఎంఆర్'

న్యూఢిల్లీ, జూలై 24: టీబీని తక్కువ ఖర్చులో, వేగంగా గుర్తించడానికి భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. 'సీఆర్ఐఎస్‌పీఆర్ టీబీ డిటెక్షన్' అనే టెక్నాలజీని వాణిజ్యపరంగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఐసీఎంఆర్ పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నది. టెక్నాలజీని బదిలీ చేయటం ద్వారా 'టీబీ డిటెక్షన్' సిస్టమ్స్ తయారీపై వివిధ సంస్థలు, కంపెనీలకు ఆహ్వానం పలికింది. డిబ్రూగఢ్‌లోని ఐసీఎంఆర్ సైంటిస్టులు, రోగి లాలాజలం నుంచి డీఎన్‌ఏను తీసుకొని టీబీ బ్యాక్టీరియాను గుర్తించే టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ప్రపంచంలోనే అత్యంత చవకైన పద్ధతిగా దీనిని వారు పేర్కొన్నారు. సుమారుగా 1500 శాంపిల్స్‌ను కేవలం రెండు గంటల్లో పరీక్షించి, టీబీ ప్రాథమిక లక్షణాల్ని గుర్తించవచ్చునని చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ (పీహెచ్‌సీ) ఈ పరీక్షలు నిర్వహించవచ్చునని ఐసీఎంఆర్ సైంటిస్టు ఒకరు చెప్పారు.

హాటెస్ట్ డేగా జూలై 22

84 ఏండ్లలో ఇదే అత్యధికం

న్యూఢిల్లీ: గత 84 ఏండ్లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజుగా జూలై 22వ తేదీ రికార్డు సృష్టించింది. ఈ రోజున ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 17.15 డిగ్రీలుగా నమోదైనట్టు యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్(సీ3ఎస్) తెలిపింది. జూలై 21వ తేదీన 17.09 డిగ్రీల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత నమోదు కావడం రికార్డు సృష్టించగా, మరునాడే దీనికి మించి నమోదైందని పేర్కొన్నది. తమ ప్రాథమిక డాటా ప్రకారం 1940 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజు జూలై 22 అని సీ3ఎస్ తెలిపింది. దీనికి ముందు గత ఏడాది జూలై 6న అత్యధికంగా 17.08 డిగ్రీల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది జూన్ నెల నుంచి వరుసగా 13 నెలలుగా ప్రతి నెలా ఉష్ణోగ్రతలు రికార్డులు సృష్టిస్తున్నాయని సీ3ఎస్ డైరెక్టర్ కార్లో బొన్‌టెంపో తెలిపారు.

మనిషి ఒత్తిడికి తగ్గట్టు శునకాలూ మారుతాయ్!

న్యూఢిల్లీ: మనిషి ఒత్తిడికి గురైనప్పుడు శరీరం నుంచి విడుదలయ్యే వాసనను శునకాలు పసిగట్టగలుగుతాయని, దానికి తగ్గట్టుగా తమ వ్యవహారశైలిని మార్చుకుంటాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒత్తిడి వాసన రాగానే అవి కూడా నిరాశావాదంతో ఉంటాయని యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ పరిశోధకులు వెల్లడించారు. ఎవరైనా వ్యక్తి ఒత్తిడితో ఉన్నప్పుడు వారి నుంచి వెలువడే వాసనతో పక్కనున్న వ్యక్తి కూడా ప్రభావితుడు అవుతాడని గతంలోనే గుర్తించారు. ఇలాంటి ప్రభావమే జంతువులపైనా పడుతుందా? అని 18 శునకాలు, వాటి యజమానులను ఎంచుకొని పరీక్షించగా తాజా విషయం తెలిసింది.

బట్టతల సమస్యను పరిష్కరించే చక్కెర

లండన్: ప్రపంచంలో దాదాపు 50 శాతం మంది పురుషులు ఎదుర్కొనే బట్టతల సమస్యకు తాము పరిష్కారం గుర్తించామని చెప్తున్నారు బ్రిటన్, పాకిస్థాన్‌కు చెందిన కొందరు పరిశోధకులు. జీవుల్లో సహజంగా ఉత్పత్తయ్యే 2-డీయాక్సీ-డీ-రిబోస్ అనే జీవుల్లో సహజంగా ఉత్పత్తయ్యే చక్కెర ద్వారా బట్టతలపై వెంట్రుకలు తెప్పించవచ్చని చెప్తున్నారు. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్, పాకిస్థాన్‌లోని కామ్‌సాట్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ చక్కెరను గుర్తించారు. ఇది రక్తనాళాల ఏర్పాటుకు దోహదపడుతుందని, వెంట్రుకల కుదుళ్లను పోషించి కొత్త వెంట్రుకలు పెరిగేందుకు ఉపయోగపడుతుందని వీరు తెలిపారు. గాయాన్ని మానిపించేందుకు రక్తనాళాన్ని పెంచేందుకు గత ఎనిమిదేండ్లుగా 2-డీయాక్సీ-డీ-రిబోస్ వినియోగంపై ప్రయోగాలు చేస్తున్నామని, అనూహ్యంగా ఇది వెంట్రుకలు పెరగడానికి కూడా ఉపయోగపడుతుందని తేలిందని చెప్పారు. ఇప్పుడు బట్టతలకు చికిత్సగా ఇస్తున్న మైనాక్సిడిల్ ఇచ్చే ఫలితాలకు సమానంగా దీని ఫలితాలు కూడా ఉన్నాయని తేలిందని పేర్కొన్నారు.

మా బకాయిలు చెల్లించండి

రాంచీ, జూలై 24: కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జార్ఖండ్ రాష్ట్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం హేమంత్ సోరేన్ ఆరోపించారు. తమ రాష్ట్రానికి కేంద్రం రూ.1.36 లక్షల కోట్లు బకాయి పడిందని, వాటిని వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 'మా రాష్ట్రంపై ఎందుకు వివక్షకు పాల్పడ్డారు? ఇప్పటికే కేంద్రం మాకు రూ.1.36 లక్షల కోట్లు బకాయి ఉంది. కానీ, బీజేపీ నేతలంతా దీనిపై మౌనంగా ఉన్నారు. మీ ఊతకర్ర పార్టీలకే ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చుకోండి' అని ఆయన బీహార్, ఏపీ ప్యాకేజీల గురించి ఆగ్రహం వ్యక్తం చేశారు. జార్ఖండ్ రాష్ట్రం ఎన్డీఏకు 9 మంది ఎంపీలను ఇచ్చినా పూర్తి నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు. దేశంలో 60 శాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి ఇవ్వాల్సిన బడ్జెట్‌ను దోచి కేంద్రం తన కుబేర స్నేహితులకు కట్టబెట్టిందని సోరేన్ విమర్శించారు.

సాగు చట్టాలకు దొడ్డి దారి

బడ్జెట్‌పై ఎస్కేఎం ఆగ్రహం

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2024-25పై సంయుక్త కిసాన్ మోర్చా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడానికి ఈ బడ్జెట్ బాటలు పరుస్తున్నదని మండిపడింది. రద్దయిన మూడు సాగు చట్టాలకు దొడ్డి దారిలో ప్రవేశం కల్పిస్తున్నదని ఆరోపించింది. ఎస్కేఎం నేతలు బుధవారం వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కొత్త బడ్జెట్‌లో రైతుల స్థితిగతులను మెరుగుపరచే నిబంధనలేవీ లేవన్నారు. భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయిత్ మాట్లాడుతూ, ఈ బడ్జెట్‌లో రైతుల కోసం ఏమీ లేదన్నారు. గత ఏడాది బడ్జెట్ మాదిరిగానే ఇది కూడా ఉందని దయ్యబట్టారు. బీహార్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చినప్పటికీ, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఆలిండియా కిసాన్ మహా సభ నేత అశిష్ మిట్టల్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల ఉత్పత్తి తగ్గిపోతుందని అంటూ శ్రీలంక పరిస్థితిని గుర్తు చేశారు. జై కిసాన్ ఆందోళన్ నేత అవిక్ సాహా మాట్లాడుతూ, సాగు చట్టాలకు దొడ్డి దారి ప్రవేశం కల్పించేందుకు ఈ బడ్జెట్ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోచింగ్ ఫీజుపై దక్కని ఊరట

బడ్జెట్‌పై నీట్ అభ్యర్థుల అసంతృప్తి

కోటా : విద్యార్థుల కోచింగ్ ఫీజ్‌పై ఇప్పటివరకు 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్న కేంద్రం ఈ బడ్జెట్‌లో దానికి మినహాయింపు ఇస్తుందని విద్యార్థులు ఆశించారు. అయితే ఎలాంటి రాయితీ ఇవ్వకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇక్కడ నీట్‌కు కోచింగ్ తీసుకుంటున్న పలువురు విద్యార్థులు కేంద్రంపై మండిపడ్డారు. 'విద్య ఒక హక్కు. దానిపై ఎలాంటి పన్ను ఉండరాదు. అయితే ప్రభుత్వం 18 శాతం ముక్కుపిండి వసూలు చేస్తున్నది. కోచింగ్ ఫీజుపై జీఎస్టీని మినహాయిస్తే ఎందరో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గేది. కానీ ఆ దిశగా కేంద్రం ఎలాంటి చర్య తీసుకోలేదు' అని ఒక నీట్ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు.

అలా చేస్తే మీరు ఒంటరైపోతారు!

చెన్నై, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో విపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కకపోవడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఆయన బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఎన్నికలు అయిపోయాయి. ఇప్పుడు మనం దేశం గురించి ఆలోచించాలి. 2024 బడ్జెట్ మీ ప్రభుత్వాన్ని కాపాడవచ్చు. కానీ, ఈ దేశాన్ని మాత్రం కాపాడదు. ప్రభుత్వాన్ని నిష్పక్షపాతంగా నడిపించండి. మిమ్మల్ని ఓడించిన వారి పట్ల ఇంకా ప్రతీకారం తీర్చుకోకండి. మీ రాజకీయ ఇష్టాయిష్టాల ప్రకారం పాలన చేస్తే మీరు ఒంటరిగా మిగులుతారు' అంటూ స్టాలిన్ వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు కేటాయింపులు లేకపోవడంపై డీఎంకే ఎంపీలు బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలియజేశారు.

విమర్శిస్తే.. అవమానిస్తారా?

- ప్రజలను ట్రోల్ చేయడం సరికాదు
- బీజేపీ ఐటీ సెల్‌పై ఆర్ఎస్ఎస్ రచయిత రతన్ శార్ద ఆగ్రహం

బీజేపీ నేతల వైఖరిపై విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 24: బీజేపీ ఐటీ విభాగం వైఖరి, దాని అధ్యక్షుడు అమిత్ మాలవీయ తీరుపై రచయిత రతన్ శార్ద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలను ట్రోల్ చేస్తున్న బీజేపీ ఐటీ సెల్ వైఖరి తీవ్ర సమస్యగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఆస్తుల అమ్మకాలపై ఇండెక్సేషన్ తొలగిస్తూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమయ్యాయి. వీటిపై స్పందించిన బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ.. 'ఈ రాత్రికి ప్రతిఒక్కరూ ఇండెక్సేషన్ నిపుణులే' అంటూ ఎద్దేవా చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేసి తర్వాత డిలీట్ చేశారు. ఈ పోస్ట్‌పై రతన్ శార్ద స్పందించారు.